మాలుతున్నట్టుంది పిల్ల తండ్రి ధోరణి.

పిల్ల కాస్త లావు వల్ల వయసుకి మించి కనిపిస్తోంది. ఆయన ఎంత విసిగిపోయాడో ఏమో! ఉద్యోగం లేని వరుడికైనా కట్నం ఎక్కువ ఇచ్చి అయినా కూతురి పెళ్లి చేసెయ్యాలన్న గట్టి నిర్ణయం కనిపిస్తోంది.

పిల్ల మనస్ఫూర్తిగా నచ్చలేదు. నచ్చనిదాన్ని నచ్చినట్టు చేయాలంటే కావల్సినంత కట్నం డిమాండ్ చేసి రాబట్టాలని పంతంగా ఉన్న సుభద్రమ్మ ససేమిరా అంటుంది. నేను నోరు విప్పి ఒక్కమాట మాట్లాడలేకపోయిన వాళ్ల వాళ్ల ఫీలింగ్స్‌ని మాత్రం కచ్చితంగా కనిపెట్టేస్తున్నాను.

అంతా విన్న మధ్యవర్తి ఏమనుకున్నాడో ఏమో! మా అందర్నీ లోపలకి పిలిచాడు.

''సుభద్రమ్మగారూ! అయ్యా శంకర్రావు గారూ! ఇలా అంటున్నందుకు ఏమీ అనుకోకండి. అమ్మాయి కాస్త లావు ఒప్పుకున్నాను. అందుకోసమే మీరు కాస్తా పెదవి విరుస్తున్నారన్న సంగతి నాకు తెలుసు. అమ్మాయి గుమ్మడి పండులా ఉండబట్టే కదా ఉద్యోగం లేని మీ అబ్బాయి కోసం ఇంత దూరం రావటం. పిల్ల మెరుపుతీగే అయితే మీ స్థితికి మీ వైపు కన్నెత్తి కూడా చూసేవారు కాదు. మీ అబ్బాయికి ఉద్యోగం లేదు సరి కదా...కనీసం సొంత ఇల్లు లేదు...వెనుక ఆస్తి కూడా లేదు. వారు సంతోషంగా ఇచ్చిన దానికి సం...తృ...ప్తి'' ఆయన మాట పూర్తి కాలేదు.

గయ్యిమంది సుభద్రమ్మ. ''ఉద్యోగం లేదన్న విషయం వేలెత్తి చూపించనవసరం లేదు. అది తెలిసే మీరు వచ్చారు. ఇహ ఆస్తి దాని వివరాలు అంటావా? వేరే ఆస్తి ఎందుకు? లక్షలు కోట్ల విలువ చేసే మగబిడ్డని కనటమే గొప్ప ఆస్తి. మగాడికి ఉద్యోగం లేకపోయినా...ఆస్తి లేకపోయినా వాడి విలువ తగ్గదు. ఆ విలువ ఉండబట్టే కదా పిల్లతో పాటు కట్నం ఇస్తామని వచ్చారు'' ఇంకా ఆమె చేతులు తిప్పుతూ ఏమేమో అంటోంది.

ఆడపిల్లని కనటం అంత పాపమా? లేక నేరమా? ఆడపిల్లని కన్నవాళ్ల పరిస్థితి ఇంత అధ్వానమా? ఇంత దయనీయమా? ఆడజన్మ అంత నీచమా? నా చెవులు...మెదడు కూడా పనిచేయటం మానేశాయి. రేపు నా బిడ్డల పరిస్థితేంటి? అప్పుడే టీనేజ్‌లోకి ఎంటరయిన ముగ్గురు కూతుళ్లూ నా కళ్ల ముందు సినిమా రీల్‌లా గిర్రున తిరుగుతున్నారు.

**-కె. విజయలక్ష్మి (బాపట్ల)**

# అసలు నిజం

ట్రాన్స్‌ఫర్‌ల కోసం ఉపాధ్యాయులకు నిర్వహించే కౌన్సిలింగ్‌లో ఎట్టకేలకు చివరికి తాను కోరుకున్న ఊరు లభించడంతో ఎంతో ఆనందించింది రాధ. ఇన్నాళ్లుగా తన వారికి దూరంగా ఒంటరిగా ఉండి ఎంతో బాధకు గురయిన రాధకు కౌన్సిలింగ్ పుణ్యమాని కోరుకున్న ప్రదేశం దొరకడంతో ఇక ఓ ఐదారు సంవత్సరాల వరకు ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉండొచ్చనే ఆలోచన ఎంతో ఊరటను కలిగించింది.

అలా ఒక రోజున పనిచేసే పాఠశాల నుండి రిలీవై వెళ్లి కొత్త పాఠశాలలో జాయిన్ అయింది రాధ. సహజంగా ఎక్కడయినా ఉపాధ్యాయులు ఆప్యాయంగా, స్నేహంగానే ఉంటారు. దానికి తోడు రాధది కూడా సరళ స్వభావమే కనుక కొత్తనేది లేకుండా త్వరలోనే ఆ వాతావరణానికి అలవాటు పడిపోయింది రాధ. ఎవరూ వేలెత్తి చూపకుండా తన పని తాను చేసుకుని పోయే రాధ ఎవరికేం పని కావాలన్నా కాదు రాదు అనకుండా ఎంతో ఓపిగ్గా సంతోషంగా చేసి పెర్చేది. ఆఫీస్ పని సొంతంగా రాకపోయినా అవీ ఇవీ రాయడం కూడా శ్రమనుకోకుండా చేసేది.

అయితే ఆ పాఠశాల ఆఫీసులో పనిచేసే క్లర్క్‌కు అంతగా పనిచేయడం రాదనే విషయం ఓ నాలుగు రోజుల్లోనే తెలిసిపోయింది రాధకు. కానీ అతనికి పని రాకపోయినా అక్కడ పనిచేసే టీచర్లలో ఒకరు సహాయం చేసేవారు. అతని పనంతా ఆయనే చూసేవాడు. ఇక క్లర్క్ ఏ పని చేయకుండా కనీసం నేర్చుకునే ప్రయత్నం చేయకుండా ఊరికే కూర్చొని ఉండిపోయేవాడు. అది చూసిన రాధకు అబ్బా! ఎంత మంచితనం తోటి వ్యక్తికి పని



రాకపోయినా అతన్ని కూర్చోబెట్టి సమస్త పనులు తానొక్కడే చేసుకోవడం ఎంత గొప్ప అంటూ మనసులో ఎంతగానో ఆ టీచర్‌ను అభినందించుకునేది. అలా కొన్ని రోజులు గడచిపోయాయి. అప్పుడు తెలిసింది అసలైన నిజం క్లర్క్‌కు తోటి మనిషిగా సహాయం చేయడం లేదని. అందుకోసం అతడి నుండి ప్రతి నెలా కొంత డబ్బు ఇప్పించుకొని దానితో ఫోన్, కరెంటు బిల్లులు చెల్లిస్తారని, ఆ సహాయం చేసే వ్యక్తే ఎక్కువగా ఫోన్‌ను ఉపయోగించుకుంటాడని, అందుకే సహాయం చేస్తున్నాడని తెలియడంతో ఔరా అదన్న మాట అసలు సంగతి. ఎదుటివారి నుండి లాభం లేకుండా ఎవరూ అయాచితంగా సహాయం చేయరని మొదట తను ఊహించింది తప్పని అనుకున్నది రాధ. అంతేకాదు అతనికొచ్చే తక్కువ జీతంలో పని రానందుకు కొంత పోగొట్టుకోగా మిగిలింది ఎలా సరిపోతుందో. కనీసం ఇప్పటికైనా పని నేర్చుకుంటే బాగుంటుందిగా అని చేసేదేం లేక మనసులోనే జాలిగా నిట్టూర్చింది రాధ.

**-ఎస్.కె. దుర్గ (క్యాతూరు)**